సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం ¦ 8 ¦ సెప్టెంబర్ ¦ 2025



అలుపెరుగని 'ఆట'సారి..
బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి 73 ఏళ్ల వయసు లోనూ పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతూ పతకాలు సాధిస్తున్నాడు. 8లో



మహిళా 'వికాసం'
మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఖమ్మంలోని దుర్గాబాయి మహిళా వికాస కేంద్రం తోడ్పాటునందిస్తోంది. 8లో

గరిష్టం / కనిష్టం
32°/ 23°

వాతావరణం
జిల్లాలో సోమవారం ఆకాశంలో మేఘాలు ఆవరిస్తాయి. మధ్యాహ్నం ఒకటి, రెండు చోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పర్ణశాల ఆలయం మూసివేత



ఆలయం తలుపులు మూసివేస్తున్న అర్చకులు, సిబ్బంది

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం మూసేశారు. స్వామివారికి మధ్యాహ్నిక, సాయంకాల ఆరాధన, ఆరగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులకు దర్శనం కల్పించి అనంతరం ఆలయ తలుపులు మూసేశారు. తిరిగి సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు ఆలయం తెరిచి సంప్రోక్షణ, శుద్ధి తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 7.30 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ తెలిపారు.

వైభవంగా చండీహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం, చండీహోమం, విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని యాగశాలలో చండీహోమం పూజలు చేశారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజలు చేశాక చండీహోమం జరిపారు. చివరన పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమం పూజలోపాల్గొన్న భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, సభ్యులు చందుపట్ల రమ్య, పాపారావు, రామిరెడ్డి, శ్రీనివాస్, సాయిబాబా, సుధాకర్, శేఖర్ అర్చకులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయం మూసివేత..
చంద్రగ్రహణం సందర్భంగా పెద్దమ్మతల్లి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన సౌకర్యం కల్పించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు.

కొత్తగూడెం, భద్రాచలంలో నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో అత్యధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొత్తగూడెం డివిజన్‌కు సంబంధించి కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో, భద్రాచలం డివిజన్‌కు సంబంధించి భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర సమస్యలు ఉన్నవారు కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డ్ సెక్షన్‌లో తమ దరఖాస్తులను అందించి రశీదు పొందాలని, వాటిని సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం ఉండదని తెలిపారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని పీఓ పేర్కొన్నారు.


కిన్నెరసాని నుంచి నీటి విడుదల



రిజర్వాయర్ నుంచి దిగువకు వదులుతున్న వరదనీరు

పాల్వంచరూరల్: ఎగువ నుంచి కిన్నెరసాని జలాశయంలోకి వరద ఉధృతి కొనసాగుతోంది. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులుకాగా, 1000 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం నీటిమట్టం 405.50 అడుగులకు పెరిగింది. ప్రాజెక్ట్ గేటు ఎత్తి ఉంచి 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

ఆనకట్ట తెగినా.. పెరిగిన వరిసాగు



పెదవాగు ప్రాజెక్ట్ ఆయకట్టులో సాగు చేసిన వరి పంట



గతేడాది పెదవాగు ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు పడిన భారీ గండి (ఫైల్)

గతేడాది కొట్టుకుపోయిన పెదవాగు ప్రాజెక్ట్ ఆనకట్ట

- ఆయకట్టులో స్వల్పంగా మాత్రమే తగ్గిన పంటల సాగు
- వర్షాధారంగా సాగుకు మొగ్గు చూపిన రైతులు

అశ్వారావుపేటరూరల్: పెదవాగు ప్రాజెక్ట్ ఆనకట్ట తెగినా ఆయకట్టులో సాగు పెద్దగా తగ్గలేదు. గతం కంటే కేవలం 178 ఎకరాల్లోనే సాగు తగ్గింది. కానీ వరి సాగు మాత్రం గతం కంటే పెరిగింది. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలో 0.6 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 1975లో ప్రాజెక్ట్ నిర్మించారు. అశ్వారావుపేట మండలంతోపాటు, ఏపీలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 16 వేల ఎకరాలకు కుడి, ఎడమ కాలువల ద్వారా సాగు నీరు అందించారు. తెలంగాణలో 3 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, మిగతాది ఆంధ్రాలో ఉంది. భారీ వర్షాలు, అధికారుల నిర్లక్ష్యంతో గతేడాది జూలై 18న ప్రధాన ఆనకట్టకు గండ్లు పడ్డాయి. దీంతో ఆయకట్టు సాగు భారీగా తగ్గిపోతుందనే ఆందోళన నెలకొంది. కానీ పంటల విస్తీర్ణం స్వల్పంగా మాత్రమే తగ్గింది. గతేడాది వానాకాలంలో 3,053 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేయగా, ఈ ఏడాది 2,875 ఎకరాల్లో సాగు చేశారు. వరి పంట గతేడాది 1,194 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 1,420 ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది కంటే 226 ఎకరాల్లో వరి సాగు పెరిగింది.

250 మీటర్ల మేర గండ్లు
పెదవాగు ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు 250 మీటర్ల దాకా గండ్లు పడి కొట్టుపోగా, దాదాపు 20 చోట్ల ప్రధాన కట్ట దెబ్బతిన్నది. కుడి, ఎడమ కాలువ స్లచ్చర్లు దెబ్బతిన్నాయి. ఆయకట్టు కింద అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి, వడ్డర రంగాపురం, కోయ రంగాపురం, బచ్చువారిగూడెం, కొత్తూరు పరిధిలో వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగు చేస్తుండగా, గతేడాది కంటే ఈసారి వరి సాగు విస్తీర్ణం పెరిగింది. పత్తి పంట సాగు స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్ట్ నుంచి సాగునీరు అందే పరిస్థితి లేకపోవడంతో ఆయకట్టు రైతులంతా వర్షాధారంగా సాగు చేపట్టారు. ఈ క్రమంలో వరి సాగుకు మొగ్గుచూపారు. మొక్కజొన్న ఒక్క ఎకరాలో కూడా సాగు చేయలేదు. మిర్చి గతేడాది 250 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈసారి 50 ఎకరాలను

వానాకాలం పంటల సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

పంట పేరు	గతేడాది	ఈ ఏడాది
వరి	1,194	1,420
పత్తి	1,429	1,405
మొక్కజొన్న	180	00
మిర్చి	250	50
మొత్తం	3,053	2,875

వర్షాధారంగా..
పెదవాగు ప్రాజెక్ట్ పునర్నిర్మాణం ఇప్పట్లో జరిగే అవకాశాలు లేకపోవడంతో అశ్వారావుపేట మండలంలోని రైతులు వర్షాధారంపైనే పంటలను సాగు చేస్తున్నారు. పెదవాగు ఆయకట్టు కింద వరిక్షేత్రాలే అధికంగా కనిపిస్తున్నాయి. ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోతే వరి పంట సాగు చేసే రైతులకు తీరని నష్టం వాటిల్లే అవకాశాలు ఉండగా, వాన దేవుడే దిక్కుగా పంటను సాగు చేస్తున్నారు.

వరి సాగు పెరిగింది..



పెదవాగు ప్రాజెక్టు కింద గత ఏడాది కంటే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు పెరిగింది. గతేడాది ఆనకట్టకు గండ్లు పడిన తర్వాత పంట నష్టం వాటిల్లింది. దీంతో క్రాప్ బుకింగ్‌లో వరి పంట సాగు కొంతమేర నమోదు తగ్గింది. తాజాగా ఆయకట్టు రైతులు వర్షాధారంగా వరి పంట సాగుకు అధికంగా మొగ్గు చూపారు. మొక్కజొన్న పంటలు సాగు చేసే రైతులు కూడా వరి పంట సాగు చేయడం వల్ల వరిసాగు పెరిగి ఉండొచ్చు.

– పి.శివరామ ప్రసాద్, ఏఓ, అశ్వారావుపేట

23 నుంచి దసరా వేడుకలు

- రామాలయంలో రోజుకో అలంకరణలో మహాలక్ష్మి దర్శనం
- అక్టోబర్ 2న శమీ, ఆయుధ పూజ, శ్రీ లీలా మహోత్సవం
- 7న శబరి స్మృతియాత్ర, వాల్మీకి జయంతి



విజయదశమి రోజున సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య(ఫైల్)

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 23 నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు అశ్వయుజ మాసంలో జరిగే ఉత్సవాలు, విజయ దశమి వేడుకల వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 2న జరిగే విజయదశమి వేడుకలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఆలయంలో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారు 23 నుంచి రోజుకో అలంకరణలో భక్తులకు కనువిందు చేయనున్నారు. అక్టోబర్ 7న శబరి స్మృతియాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ దామోదర్‌రావు, వైదిక కమిటీ సభ్యులు తెలిపారు.

తొమ్మిదిరోజులపాటు ప్రత్యేక పూజలు
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతీ ఏడాది తొమ్మిది రోజులపాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తారు. స్వామివారి సన్నిధిలో తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా వేడుకలు జరుపుతారు. దశమి రోజున భక్తరామదాసు నిర్మించిన దసరా మండపంలో శమీ, ఆయుధ పూజలు, లీలా మహోత్సవం కనుల పండువగా నిర్వహిస్తారు. కాగా ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో 24 నుంచి 2వ తేదీ వరకు శ్రీరామాయణ పారాయణం జరగనుంది. ఇందులో భక్తులను, స్వామి వారి ఆరాధకులను ఈ ఏడాది భాగస్వామ్యం చేయనున్నారు. శ్రీలక్ష్మి అమ్మవారి సన్నిధిలో అభిషేకం, చిత్రకూట మండపంలో సామూహిక శ్రీ రామాయణ పారాయణం, మధ్యాహ్నం శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చనలు జరగనున్నాయి. అక్టోబర్ 2న శమీ, ఆయుధ పూజ, శ్రీ లీలా మహోత్సవం నిర్వహించనున్నారు.

వచ్చే నెల 7న శబరి స్మృతి యాత్ర
వచ్చే నెల 7వ తేదీన అశ్వయుజ మాస పౌర్ణిమ సందర్భంగా శబరి స్మృతి యాత్రను జరపనున్నారు. రాముడి అపర భక్తురాలు శబరికి ఫల, పుష్పాలతో అంజలి ఘటించనున్నారు. అదే రోజున వాల్మీకి జయంతి వేడుకలకు సన్నాహాలు చేస్తున్నారు. అక్టోబర్ 20వ తేదీన నరక చతుర్దశి దీపావళి సందర్భంగా మూలమూర్తులకు తెల్లవారుజామున అభిషేకం, సాయంత్రం మంగళ స్నానాలు, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

తేదీ	అలంకారం	పారాయణం
ఈ నెల 23న	ఆదిలక్ష్మి	బాలకాండ
24న	సంతాన లక్ష్మి	అయోధ్యకాండ
25న	గజలక్ష్మి	అయోధ్యకాండ
26న	ధనలక్ష్మి	అరణ్యకాండ
27న	ధాన్య లక్ష్మి	కిష్కింధకాండ
28న	విజయలక్ష్మి	సుందరకాండ
29న	ఐశ్వర్యలక్ష్మి	యుద్ధకాండ
30న	వీరలక్ష్మి	యుద్ధకాండ
అక్టోబర్ 1న	మహాలక్ష్మి (నిజరూప)	యుద్ధకాండ

తెలుగు రాష్ట్రాల్లోనే అధికంగా సాగు

- ఆయిల్‌పామ్ సాగుకు అశ్వారావుపేటనే ఆదిగురువు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఫ్యాక్టరీలో ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: దేశంలో తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఏపీలోనే అత్యధికంగా ఆయిల్‌పాం తోటలు సాగు చేస్తున్నారని, ఆ తర్వాత కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సాగవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించారు. గెలల నిల్వలు, కన్వేయర్ బెల్ట్, యంత్రాలతోపాటు పవర్ ప్లాంట్ తనిఖీ చేశారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆయిల్‌పాం తోటల సాగుకు అశ్వారావుపేట మండలం ఆదిగురువని, ఇక్కడ పంట బాగుందంటేనే మిగిలిన ప్రాంతాల్లో విస్తరిస్తోందని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఎకరం విలువ రూ.5 కోట్లపైనే ఉన్నా ఆయిల్‌పాం తోటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. సిద్దిపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి కాగా ట్రయల్ రన్ నడుస్తోందని తెలిపారు. వేంసూరు మండలం కల్లూరిగూడెంలో, కొణిజర్లలో పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం ఏడాదిలోపు పూర్తవుతుందని అన్నారు. వనపర్తి, బీచ్‌పల్లిలో కూడా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ గెలల టన్ను ధర రూ.25 వేలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రులకు విన్నవించినట్లు తెలిపారు. తొలుత పామాయిల్ తోటలు, ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చిన యాద్రాద్రి జిల్లా రైతులు మంత్రిని కలిశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ అధికారులు సుధాకర్ రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్లు నాగబాబు, కల్యాణ్, నాయకులు ఆలపాటి రామచంద్రప్రసాద్, మొగళ్లపు చెన్నకేశవరావు, బండి భాస్కర్, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి, ఎస్‌కే పాషా, పి.జీవన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన 'ఉద్యాన' విద్యార్థులు
మండలంలోని గంగారంలో ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. సాగు చేస్తున్న వక్క, ఆయిల్‌పామ్, కొబ్బరి తోటల తోపాటు అంతర పంటలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో విద్యార్థుల సందేహాలను మంత్రి నివృత్తి చేశారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, యూనివర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

పత్తికి ప్రతికూలమే



బూర్గంపాడు మండలంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి చేను

- భారీ వర్షాలతో దెబ్బతిన్న పత్తి చేలు
- తేమ పెరిగి ఎర్రబారిన మొక్కలు
- రాలిపోతున్న పూత, పిందె, కాయలు
- దిగుబడిపై రైతుల్లో భయాందోళన

బూర్గంపాడు: ఆగస్టు రెండో వారం వరకు ఆశాజనకంగా ఉన్న పత్తిచేలు, ఆ తర్వాత కురుస్తున్న భారీ వర్షాలతో దెబ్బతింటున్నాయి. అధిక వర్షాలతో చేలలో నీరు నిలిచి తేమ పెరగడంతో మొక్కలు ఎర్రబారుతున్నాయి. గత 20 రోజులుగా కురుస్తున్న వర్షాలతో పూత, పిందె రాలిపోతున్నాయి. కొన్నిచోట్ల కాయ దశకు రాగా అవి నల్లబడి కుళ్లిపోతున్నాయి. దీనికి తోడు ఎడతెరిపిలేని వర్షాలతో చేలలో కలుపు పెరుగుతోంది. దీంతో ఈ ఏడాది దిగుబడి ఎలా ఉంటుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు.

నిలిచిన ఎదుగుదల..
జిల్లాలో ఈ ఏడాది 2.15 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. జూన్‌లో పత్తి గింజలు వేయగా, జూన్, జూలైలో కురిసిన సాధారణ వర్షాలతో పంట ఏపుగా పెరిగింది. ఆగస్టు రెండో వారం వరకు పత్తి చేలు పూత, పిందె, కాయలతో కళకళలాడాయి. ఆ తర్వాత నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో క్రమంగా దెబ్బతింటూ వస్తున్నాయి. గత 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు పంటను మరింతగా కుంగదీశాయి. దసరా నాటికి పత్తి చేతికందుతుందని రైతులు ఆశించగా.. ఇటీవలి భారీ వర్షాలు వారి ఆశలపై నీళ్లు చల్లాయి. ఇప్పటికే రెండు విడతల ఎరువులు వేయడంతో పాటు మూడుసార్లు పై మందులు(దోమ, పురుగు, తెగుళ్ల మందులు) పిచికారీ చేశారు. అయితే వర్షాల కారణంగా పత్తిచేలలో ఎదుగుదల నిలిచిపోయింది. అధిక వర్షాలతో దోమ, పురుగు ఉధృతి పెరుగుతోంది. తేమశాతం ఎక్కువగా ఉండగా బూజు తెగుళ్లు, చీడపీడలు అధికమవుతున్నాయి. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు వానలు అడ్డంకిగా మారాయి. మందులు పిచికారీ చేస్తే వర్షానికి పనిచేయదని, మందులు, కూలీలు ఖర్చు వృథా అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మొక్కకు 10 నుంచి 20 కాయల వరకు వర్షాలతో దెబ్బతిన్నాయని చెబుతున్నారు. దీంతో ఎకరాకు కనీసం రెండు క్వింటాళ్ల మేర నష్టం తప్పదని అంటున్నారు.

యూరియా కోసం అగచాట్లు..
జిల్లాలో నల్లరేగడి, లోతట్టు ప్రాంతాల్లోని పత్తి చేలే అధిక వర్షాలతో ఎక్కువగా దెబ్బతింటున్నాయి. అయితే ఎర్రరేగడి, ఇసుక, బెట్ట ప్రాంతాల్లో మాత్రం అంతగా నష్టం వాటిల్లడం లేదు. అయితే ఆ చేలలో కూడా పూత, పిందె, కాయలు కొంతమేర రాలిపోతున్నా మొక్కలు మాత్రం ఎర్రబారలేదు. పంట దెబ్బతిన్న ఈ తరుణంలో యూరియా వినియోగించాల్సి ఉండగా కొరత కారణంగా అందుబాటులో లేదు. దీంతో రైతులు వ్యవసాయ పనులు మానుకుని యూరియా కోసం నానా అగచాట్లు పడుతున్నారు. కొందరు రైతులు నానో యూరియా పిచికారీ చేస్తున్నారు. ఇక భారీగా కలుపు పెరుగుతుండగా తీసేందుకు వర్షాల ప్రభావంతో కూలీలు రావడం లేదు. ఇప్పటికే రూ.వేలు పెట్టుబడి పెట్టగా కనీసం ఆ డబ్బయినా తిరిగివస్తుందా లేదా అని రైతులు భయపడుతున్నారు.

న్యూఢిల్లీలో సీసీఆర్‌టీ ట్రైనింగ్‌కు ఎంపిక



మోహన్‌కుమార్

దుమ్ముగూడెం : మండలంలోని పెదపాడు ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.మోహన్‌కుమార్ సీసీఆర్‌టీ ట్రైనింగ్‌కు ఎంపికయ్యాడు. మోహన్‌కుమార్ గత మే 25న జరిగిన జిల్లా స్థాయి బెస్ట్ ప్రాక్టీసెస్‌లో జిల్లా నుంచి ఎస్జీటీ కేడర్‌లో నామినేట్ అయ్యాడు. ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఎస్జీటీ బెస్ట్ ప్రాక్టీసెస్‌లో రాష్ట్రవ్యాప్తంగా 100 మందిని ఎంపిక చేయగా, వారిలో జిల్లా నుంచి మోహన్‌కుమార్ ఉన్నాడు. వీరికి న్యూ ఢిల్లీలో సీసీఆర్‌టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్) 15 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు.



బారులుదీరిన గణనాథులు

రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వినాయకుడి ప్రతిమలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు భద్రాచలం తీసుకొచ్చారు. శనివారం అర్ధరాత్రి దాటాక అధిక సంఖ్యలో విగ్రహాలు తరలివచ్చాయి. ఆదివారం కూనవరం రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి నిమజ్జన ఘాట్ వరకు వాహనాలు బారులుదీరాయి. సోమవారం వరకు నిమజ్జనం కొనసాగనుండగా, సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. –భద్రాచలంఅర్బన్

8లో

కిన్నెరసానిలో పర్యాటక సందడి



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటలు తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులను వీక్షించారు. ప్రకృతి అందాలను ఆస్వాదించారు. 410 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.22,395 ఆదాయం లభించింది. 270 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.16,210 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా ఆంధ్రప్రదేశ్ జెన్‌కో డైరెక్టర్ (హైడల్) ఎం.సుజయ్‌కుమార్, ఏపీ ట్రాన్స్‌కో రిటైర్డ్ సీఈ ప్రతాప్‌రెడ్డి, సీలేరు జలవిద్యుత్ కేంద్రం రిటైర్డ్ సీఈ రాంబాబు, కేటీపీఎస్ 5,6 దశల చీఫ్ ఇంజనీర్(సీఈ) ప్రభాకర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కిన్నెరసానిని సందర్శించారు. అనంతరం రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు.

విద్యార్థినులకు పౌష్టికాహారం

ఐటీడీఏ పీఓ రాహుల్



చికెన్‌ను పరిశీలిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: బీఈడీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికరమైన ఆహారం అందిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. పట్టణంలోని బీఈడీ కళాశాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థినులకు వడ్డించే ఆహారాన్ని పరిశీలించారు. మెనూ అమలు, కళాశాలలోని సమస్యలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఓ మాట్లాడుతూ చికెన్ సరఫరాలో ఆలస్యం కావడంతో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది వంట విషయంలో అశ్రద్ధ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వారిని తొలగించి కొత్తవారిని నియమించాలని ఏటీడీఓకు సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం ఏటీడీఓ అశోక్ కుమార్, టీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మావోయిస్ట్ ఆయుధ తయారీ కేంద్రం గుర్తింపు


బలగాలు గుర్తించిన ఆయుధ తయారీ సామగ్రి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులకు సంబంధించిన ఆయుధాల తయారీ కేంద్రాన్ని ఆదివారం భద్రతా బలగాలు గుర్తించా యి. వివరాలిలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లాలోని ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల గుంజపర్తి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టిన గుంజపర్తి క్యాంపునకు చెందిన భద్రతా బలగాలు సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు సంబధించిన ఆయు ధాల తయారీ కేంద్రాన్ని గుర్తించాయి. ఈ కేంద్రంలో లేత్ మిషిన్, జనరేటర్, వాటర్ పంప్, ఎలక్ట్రిక్ కట్టర్, హైడ్రాలిక్ సిలిండర్, మోటారు విడి భాగాలు, స్టీల్ ప్లేట్లు, ఆయుధాల తయారీకి ఉపయోగించే విడి సామగ్రితో పాటు పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని అక్కడే ధ్వంసం చేశారు.

14 నుంచి సింగరేణి ఆస్పత్రుల్లో కార్పొరేట్ సేవలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నెల 14 నుంచి హైదరాబాద్ కార్పొరేట్ వైద్యులు సింగరేణి ఆస్పత్రులను సందర్శించనున్నారని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న కొత్తగూడెంలోని ఆస్పత్రికి కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు రానున్నారని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం


తులసి (ఫైల్)

భద్రాచలంఅర్బన్: వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై భద్రాచలంటౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. నిత్యం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతోందని రాయపూడి తులసిని తన భర్త కృష్ణయ్య శనివారం రాత్రి మందలించాడు. అదే రోజు రోజు రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి ఇంతవరకు రాకపోవడంతో ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఆమె భర్త కృష్ణయ్య ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడిన ఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన కర్నాటి కిరణ్ మండలంలోని అచ్యుతాపురం వద్ద గల నర్సరీ నుంచి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని రామచంద్రాపురం గుట్ట దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. కిరణ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

అలుపెరుగని ఆటసారి..


శిక్షకుల పర్యవేక్షణలో కసరత్తు చేస్తున్న శంకర్‌రావు

- వయస్సు అడ్డురాలేదు.. 'బైపాస్'భయపెట్టలేదు..
- 73 ఏళ్ల వయసులో నాలుగు బంగారు పతకాలు
- పవర్ లిఫ్టింగ్‌లో వెటరన్ క్రీడాకారుడి ప్రతిభ
- బైపాస్ సర్జరీ అయి బంగారు పతకాలు సాధించిన ఏకైక వ్యక్తిగా రికార్డ్


జాతీయస్థాయిలో సాధించిన నాలుగు బంగారు పతకాలతో శంకర్‌రావు

భద్రాచలంటౌన్: కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు.. మహాపురుషులవుతారు.. అని ఒక సినీ కవి అన్నట్టుగానే సాధించాలనే తపన ముందు లక్ష్యం చిన్నదైపోతుందని నిరూపించాడు భద్రాచలం పట్టణానికి చెందిన బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి డీవీ శంకర్‌రావు. 73 ఏళ్ల వయస్సు.. బైపాస్ సర్జరీ అయినా జీవితంలో ఏదైనా సాధించాలనే ఆకాంక్షతో బెంచ్ ప్రెస్ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయిలో ఒకేసారి నాలుగు బంగారు పతకాలు సాధించి అందరి మన్ననలు పొందాడు. భారత్‌లో బైపాస్ సర్జరీ చేసుకుని బెంచ్ ప్రెస్ 83 కిలోల విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించిన ఏకైక వ్యక్తిగా రికార్డ్ సాధించాడు. డీవీ శంకర్‌రావు 73 ఏళ్ల వయసులో జాతీయస్థాయి రికార్డు సాధించి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆరు నెలల కృషితో..

ఎస్‌బీఐ ఉద్యోగిగా విరమణ పొందిన డీవీ శంకర్‌రావు రోజూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాకింగ్ చేసేవారు. తోటి మిత్రుడు శోభన్‌నాయక్ సలహాతో పవర్ లిఫ్టింగ్‌లో కోచింగ్ కోసం స్థానిక సిటీ స్టైల్ జిమ్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో చేరారు. బైపాస్ సర్జరీ కావడంతో వైద్యుడు శివరామకృష్ణ ఆధ్వర్యంలో శంకరరావుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తొలిసారి ఖమ్మంలో జరిగిన జిల్లాస్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో 60 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించాడు. తర్వాత హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి.. గత నెల 2 నుంచి 7 వరకు కేరళలోని కోజికోడ్‌లో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఏకంగా నాలుగు బంగారు పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. 83 కిలోల విభాగంలో బరిలోకి దిగి, వ్యక్తిగత విభాగాల్లో మూడు, ఓవరాల్ చాంపియన్‌గా మరో బంగారు పతకం సాధించి, ఔరా అనిపించారు. ఇలా బైపాస్ సర్జరీ అయి, జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన ఏకైక క్రీడాకారుడిగా చరిత్రలో నిలిచిపోయారు.

పతకాలు మిస్..

పతకాలు సాధించిన తర్వాత ఆటోలో శంకర్‌రావు బృందం వారు బస చేసిన చోటుకు బయలుదేరారు. పతకాలు ఉన్న బ్యాగును ఆటోలో మరిచిపోయి హోటల్ రూమ్‌కు వెళ్లిపోయారు. తర్వాత చూసుకుని కోజికోడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆటోను గుర్తించి, మరుసటి రోజు బ్యాగును పోలీసులు శంకర్‌రావుకు అప్పగించారు.

రికార్డుల కోసం నమోదు

శంకర్‌రావు తాను సాధించిన ఘనతలపై లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు, ఇండియన్ రికార్డ్స్ అకాడమీ, బెస్ట్ ఆఫ్ ఇండియన్ రికార్డ్స్‌కు దరఖాస్తు చేశారు. బైపాస్ సర్జరీ చేసుకుని కూడా ఒకేసారి నాలుగు బంగారు పతకాలు సాధించిన తీరుకు సంబంధించిన పూర్తి సమాచారం పంపించారు.

అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాలని..



జాతీయస్థాయిలో ఒకే సారి నాలుగు బంగారు పతకాలు సాధించడం సంతోషంగా ఉంది. ఇంటర్నేషనల్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నాను. అనుకోకుండా పవర్ లిఫ్టింగ్ నేర్చుకుని జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించడం కలగా ఉంది. నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన శిక్షకుడు రామిరెడ్డికి, వైద్యుడు శివరామకృష్ణకు ధన్యవాదాలు.

–డీవీ శంకర్‌రావు, పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు

తపన చూసి శిక్షణ ఇచ్చాం..



జీవితంలో ఏదో సాదించాలనే తపన శంకర్‌రావులో చూసి పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇచ్చాం. కానీ మా అంచనాలకు మించి ఆయన బంగారు పతకాలు సాధిస్తుంటే ఆశ్చర్యమేసింది. జాతీయస్థాయి పోటీల్లో ఒకేసారి నాలుగు బంగారు పతకాలు సాధించడంతో ఎంతో ఆనందపడ్డాం. 73 ఏళ్ల వయసులోనూ చిన్న పిల్లాడిలా వర్కవుట్‌లు చేస్తుంటారు. తన లక్ష్యాల సాధనకు మా వంతు కృషి చేస్తాం.

–రామిరెడ్డి, జిమ్ కోచ్, భద్రాచలం

జేఎంఈటీలు మళ్లీ ఉద్యోగంలోకి..

- టర్మినేట్ అయిన 43 మంది పునర్నియామకం
- సింగరేణి చరిత్రలో తొలిసారి అవకాశం

సింగరేణి(కొత్తగూడెం): అధికార హోదా (జేఎంఈటీ–జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైయినీ)లో ఉండి టర్మినేట్ అయిన 43 మంది అధికారులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోనున్నారు. వారు విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం, నిర్ణీత గడువులోకి స్టడీ సర్టిఫికెట్లు సమర్పించకపోవడంతో పాటు పలు కారణాలతో టర్మినేట్ అయ్యారు. దీంతో యాజమాన్యం వారికి మరో అవకాశం కల్పించింది. 2023లో గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ జేఎంఈటీల సమస్యను తెలుసుకుంది. అనంతరం యూనియన్ నాయకులు యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడంతో యాజమాన్యం ఈ నెల 6వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వీరంతా సంస్థ ఏర్పాటు చేసిన హైకమిటీ ఎదుట తమ వివరాలు 45 ఏళ్లకు తక్కువ కాకుండా ఉండి, (ఓవర్‌మెన్ సర్టిఫికెట్, గ్యాస్ టెస్టింగ్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు) సమర్పించుకోవాల్సి ఉంది. కమిటీ సూచన మేరకు ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరుకావాల్సి ఉంది.

ప్రాథమిక అపాయింట్‌మెంట్ జారీ

అన్ని పరీక్షలు పూర్తి అయితేనే జేఎంఈటీలకు ప్రాథమిక అపాయింట్‌మెంట్‌ను సంస్థ జారీ చేస్తుంది. తిరిగి ఉద్యోగంలో చేరిన జేఎంఈటీలకు గ్రేడ్–సీ, ప్రాథమిక నియామకం అందిస్తారు. తొలి ఏడాదిలో 190 మస్టర్లు తగ్గకుండా చేస్తే పర్మనెంట్ ఉద్యోగం వచ్చినట్లవుతుంది. లదంలే తిరిగి టర్మినేట్ అవుతారు.

మరో అవకాశం అదృష్టం



గతంలో బదిలీ వర్కర్లు, జనరల్ అసిస్టెంట్లు వివిధ కారణాలతో డిస్మిస్ అయితే సంస్థ వారికి ఉద్యోగ అవకాశం కలిపించేది. కానీ, సింగరేణిలో తొలిసారిగా టర్మినేట్ అయిన జేఎంఈటీలకు మరో అవకాశం కల్పించటం వారి అదృష్టం. ఇప్పటికైనా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి పనిచేసి, సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి.

–ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి

18 మాసాల కృషి..



పలు కారణాలతో టర్మినేట్ అయిన జేఎంఈటీలను విధుల్లోకి తీసుకోవాలని ఎన్నికల్లో గెలిచిన తరువాతి నుంచి యాజమాన్యంతో కొట్లాడాం. బీడీఓ మీటింగ్, ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చించాం. వారికి ఉద్యోగం తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరాం. స్పందించిన అధికారులు వీరికి మరో అవకాశం కల్పించారు.

–వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యాదర్శి

సద్వినియోగం చేసుకుంటాం



కంపెనీ అందించిన అవకాశాన్ని గతంలో మేము సద్వినియోగం చేసుకోలేకపోయాం. ఫలితంగా ఉద్యోగం లేని వ్యథను అనుభవించి యూనియన్ నాయకులను, అధికారులను కలిసి, ఐదేళ్లు చేసిన పోరాటం ఫలితంగా సంస్థ మరో అవకాశం కల్పించింది. ఈసారి సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకునే ప్రయత్నం చేస్తాం.

–పి.శ్రీచరణ్, జేఎంఈటీ

పస్తులు ఉన్నాం..



నేను చేసిన చిన్న తప్పిదం కుటుంబాన్ని పస్తుల్లోకి నెట్టింది. 2022 నుంచి నేటి వరకు జీతం లేక ఆర్థికంగా దుర్భర జీవితాన్ని అనుభవించాం. టర్మినేట్ అయిన నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. తల్లిదండ్రులు, భార్య ఇచ్చిన ధైర్యంతో ముందుకు వెళ్లాను. యూనియన్ నాయకులు, అధికారులు స్పందించి మాకు కొత్త జీవితం ప్రసాదించారు.

–టి.శ్రీకాంత్, జేఎంఈటీ


నిమజ్జనానికి బారులుదీరిన గణేశ్ విగ్రహాలు

కొనసాగుతున్న నిమజ్జనం

- రాష్ట్ర నలుమూలల నుంచి గణనాథులతో తరలివచ్చిన భక్తులు
- గోదావరి ఒడ్డుకు ఇప్పటివరకు 1,595 ప్రతిమలు
- ఆకట్టుకున్న విభిన్న రూపాలు, విగ్రహాలు
- భారీ విగ్రహాల నిమజ్జనంలో ఆలస్యం


బాహుబలి క్రేన్ ద్వారా విగ్రహాన్ని లాంచీలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని గోదావరిలో నిమజ్జనం చేసేందుకు రాష్ట్ర నలుమూలాల నుంచి వినాయకుడి విగ్రహాలతో భక్తులు శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత భారీగా చేరుకున్నారు. శనివారం అర్ధరాత్రి కూడా విరామం లేకుండా సిబ్బంది వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. కాగా, ఆదివారం ఉదయం కూనవరం రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నుంచి నిమజ్జన ఘాట్ వరకు బారులుదీరిన గణనాథులను ఒక్కొక్కటిగా గోదావరి ఒడ్డుకు చేర్చారు. రెండు రోజులుగా భద్రాచలంలో ఎండతీవ్రత ఎక్కువగా ఉండటం ఆదివారం వర్షం పడటంతో నిమజ్జన ఘాట్ చల్లగా మారింది. ఆదివారం సాయంత్రం వరకు 353 గణేశ్ విగ్రహాలు రాగా, వీటిలో భారీ విగ్రహాలు ఎక్కువగా ఉన్నాయి. వీటి నిమజ్జనం ఆలస్యమైంది. వారం రోజులుగా 1,595 గణపతి విగ్రహాలు గోదావరిలో నిమజ్జనమయ్యాయని సిబ్బంది తెలిపారు.

బల్లకట్టు ఏర్పాటు చేస్తే..

ప్రస్తుతం భద్రాచలం వద్ద ఉన్న గోదావరిలో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అధికారులు రెండు లాంచీలను ఏర్పాటు చేశారు. కాగా ఇందులో ఒక లాంచీకి గేర్ బాక్స్‌లో సమస్య తలెత్తడంతో మరో చిన్న బోట్‌కు తాడుకట్టి నిమజ్జనానికి తీసుకు వెళ్లాల్సివస్తోంది. వచ్చే ఏడాది వరకైనా గోదావరిలో బల్లకట్టు ఏర్పాటు చేస్తే ఇలాంటి సమస్యలు ఉండవని భక్తులు అభిప్రాయపడుతున్నారు. గతేడాది బల్లకట్టు ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అనుకున్నప్పటికీ సాధ్యం కాలేదు. ఈ నెల 4న నిమజ్జన ఘాట్‌కు వచ్చిన కలెక్టర్ బల్లకట్టు ఏర్పాటుపై చర్చించారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న లాంచీలు కూడా పాతవి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసే పరిస్థితి కూడా లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బల్లకట్టు ఏర్పాటుపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మృతి

పలు పార్టీల నాయకుల సంతాపం


ఎస్డీ జియాఉద్దీన్ (ఫైల్)


జియాఉద్దీన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

తిరుమలాయపాలెం: జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు, యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, సీపీఎం మండల మాజీ కార్యదర్శి సుబ్లేడు గ్రామానికి చెందిన ఎస్డీ జియాఉద్దీన్ (76) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఖమ్మంలోని ఆయన నివాసంలో పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, బోడ మంచానాయక్, ఆర్మి రవి, తుళ్లూరు నాగేశ్వరరావు, నర్సయ్య, రమేశ్, స్వామి, బాబూరావు, నిర్మల్‌రావు, ఉపేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జియాఉద్దీన్ మృతి తీరని లోటు

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయ, ప్రజా ఉద్యమ నేత జియాఉద్దీన్ ఆకస్మిక మృతి తీరని లోటనీ టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావా రవి, ఎ.వెంకట్ అన్నారు. నగరంలో ఆదివారం జరిగిన సంస్మరణ సభలో వారు మాట్లాడారు. జియాఉద్దీన్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, జిల్లా ప్రజా పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో దుర్గాభవాని, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, నున్నా నాగేశ్వరరావు, మచ్చ వెంకటేశ్వర్లు, పొన్నం వెంకటేశ్వరరావు, సోమయ్య విక్రమ్, సాయిబాబు, సరళ, హైమావతి పాల్గొన్నారు. కాగా, జియాఉద్దీన్ మృతి పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: కలుపుమందు సేవించి ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సిద్ధారంలో ఆదివారం చోటుచేసుకుంది. సిద్ధారానికి చెందిన మోరంపూడి మాధవరావు (68) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నా డు. శనివారం రాత్రి ఇంట్లో ఉన్న కలుపుమందు తాగగా కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సరోజిని, కుమార్తె సత్యవాణి ఉన్నారు. ఏఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా 'వికాసం'


డ్రోన్ వినియోగంపై శిక్షణ పొందుతున్న మహిళలు

- అతివల స్వయం ఉపాధికి ఉచిత శిక్షణ
- ఇప్పటికే 12 వేల మందికి పైగా ట్రైనింగ్
- భోజన, వసతి సౌకర్యాలు కూడా..

ఖమ్మంఅర్బన్: మహిళలు ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో ఖమ్మం నగరంలోని దుర్గాబాయి మహిళా వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం) పని చేస్తోంది. ఇక్కడ ఇప్పటివరకు 12 వేల మందికిపైగా మహిళలు వివిధ కోర్సుల్లో శిక్షణ పొంది ఆర్థికాభివృద్ధి సాధించారు. ఇంకా వందలాది మంది శిక్షణ పొందుతూనే ఉన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన కొందరు మహిళలు మరో బ్యాచ్ వారికి ట్రైయినర్లుగా మారే అవకాశం కూడా ఉందని అధికారులు అంటున్నారు.

శిక్షణతో పాటు వసతి..

మహిళా ప్రాంగణంలో వ్యవసాయం, టైలరింగ్, కంప్యూటర్లు, బ్యూటీషియన్, డ్రోన్ వినియోగం, నర్సింగ్ వంటి కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. పంటల సాగులో డ్రోన్ వినియోగంపై శిక్షణతీసుకోవాలంటే ప్రైవేట్‌గా అయితే రూ.45వేలు, కంప్యూటర్ కోర్సుకు రూ. 20వేలు, నర్సింగ్‌కు రూ.లక్ష వరకు ఖర్చవుతుండగా ఇక్కడ పూర్తి ఉచితంగా నేర్పిస్తున్నారు. పంటలపై పురుగు మందులు పిచికారీ చేయడంలో డ్రోన్ వినియోగం ప్రస్తుతం కీలకంగా మారింది. ఈ కోర్సులో 45 రోజుల పాటు శిక్షణ ఇస్తుండగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లాకు చెందిన 30 మంది ట్రైయినింగ్ పొందుతున్నారు. టైలరింగ్‌లో రెండునెలల పాటు శిక్షణ ఇస్తుండగా ప్రస్తుతం 30మంది, రెండునెలల కంప్యూటర్ కోర్సులో 30మంది, 45రోజుల బ్యూటీషియన్ శిక్షణ పొందుతున్న వారు 20మంది ఉన్నారు. రెండేళ్ల నర్సింగ్ కోర్సులో 40మంది మహిళలకు శిక్షణ కొనసాగుతోంది.

మహిళలకు స్వయం ఉపాధి



మహిళలు స్వయం ఉపాధి పొందుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాలనేదే లక్ష్యం. ఇప్పటివరకు 12 వేల మందికి పైగా శిక్షణ ఇచ్చాం. ఈ ఏడాది 350 మందికి వివిధ రంగాల్లో శిక్షణ కొనసాగుతోంది. ఉన్నతాధికారుల తోడ్పాటుతో మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– వేల్పుల విజేత, మహిళా ప్రాంగణం మేనేజర్

డ్రోన్‌తో ఎంతో ఉపయోగం



మేము పదెకరాల్లో పంటలు సాగు చేస్తుంటాం. మాకు డ్రోన్ శిక్షణ చాలా ఉపయోగపడుతోంది. భవిష్యత్‌లో సబ్సిడీపై ప్రభుత్వం డ్రోన్ ఇస్తే మరింత లాభం పొందుతాం. వ్యవసాయ పనుల్లో ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా ఉంది. డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ ఎంతో సులువుగా ఉంటుంది.

–మారగాని రేణుక, పైనంపల్లి, నేలకొండపల్లి మండలం

పేదలకు సేవ చేసే అవకాశం



నర్సింగ్ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం కూడా ఇస్తున్నారు. కోర్సు పూర్తయితే మా కుటుంబానికి ఉపాధి కల్పించడంతో పాటు పేదలకు సేవ చేసే అవకాశం కలుగుతుంది. మాలాంటి వారికి అవకాశాలు కల్పించి గ్రామాల్లో వినియోగించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

– వెంపటి తేజస్విని, ఖమ్మం

పట్టుదలతో శిక్షణ పొందుతున్నా



రెండేళ్ల నర్సింగ్ శిక్షణ ఉచితంగా పొందుతున్నా. పిల్లలు, కుటుంబసభ్యులకు దూరంగా ఉండాల్సి వచ్చినా.. కష్ట పడితే మా కుటుంబం ఆర్థికంగా బలపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించేందుకు కూడా అవకాశం ఉంటుంది.

– పులిపాటి ధనలక్ష్మి, నేరెడ, కొణిజర్ల మండలం

వాగులో మునిగి వ్యక్తి మృతి


వెంకన్న (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దబండిరేవు సమీపంలోని గుబ్బలమంగి వాగులో ప్రమాదవశాత్తు మునిగి చిన్నబండిరేవు గ్రామానికి చెందిన పశువుల కాపరి పెనుగొండ వెంకన్న (55) మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వెంకన్న పశువులను తీసుకుని గుబ్బలమంగి వాగు వైపు వెళ్లగా అక్కడ గేదె వాగులో దిగడంతో దానిని బయటకు తరలించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ వెంకటప్పయ్య ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా వెంకన్న మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లోయలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

డ్రైవర్ మృతి


పాషా మృతదేహం

గుండాల: కిన్నెరసాని నుంచి ఇసుక తోలుతున్న ఓ ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన లోయలోకి దూసుకెళ్లింది. ఇసుకలో కూరుకుపోయిన డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే పాషా (65) ఇసుక తీసుకొచ్చేందుకు కిన్నెరసాని వాగుకు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లాడు. ఇసుక లోడు చేసుకుని వచ్చే క్రమంలో సాయనపల్లి – గుండాల మార్గంలో దేవరచింత వద్ద రోడ్డు పక్కన గుంతలోకి పోయి.. అటు పక్కన లోయలోకి దూసుకెళ్లింది. పాషాకు చెట్ల కొమ్మలు తగిలి ఇంజన్ టైరు పక్కన పడి ఇసుకలో కూరుకుపోయి, అక్కడికక్కడే మృతి చెందాడు. గుండాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. కిన్నెరసాని వాగు నుంచి ఇష్టానుసారంగా ఇసుక తరలిస్తుండడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ సర్పంచ్ ఇంటిపై దాడి

పాల్వంచరూరల్: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాలోత్ హరి ఇంటిపై అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు శనివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. వినాయకుని ఊరేగింపు సందర్భంగా దుస్తుల విషయంలో తలెత్తిన వివాదంతో మాజీ సర్పంచ్ ఇంటిపై దాడి చేశారు. దీంతో హరి, ఆయన భార్య అనూష, తల్లి హచ్చమ్మ గాయపడ్డారు. బాధితులు ఫిర్యాదు చేశారని, విచారణ జరుపుతున్నామని, కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.